# మూగమనసులు

# [illegible]

సుశీలా మూర్తి

టీ కప్పుల్లోకి పోసి ప్లేటులో కారం పెట్టిన జీడిపప్పు, పక్కపాటి పెట్టుకొని, డాబా మెట్లెక్కి భర్త కోసం చూసింది రమ. ప్రకాశరావు ఓ మూల కూర్చున్నాడు. చప్పుడు కాకుండా అతన్ని సమీపించి, "ఓయ్!" అంది అతి మెల్లిగా. ఉలిక్కిపడ్డాడు ప్రకాశరావు— "నువ్వా!" అంటూ.

"నేనే, ఇంకెవరు! అదేమిటి ఈ వేళ, రోజూ 'టీ, వేడి వేడి టీ' అంటూ వంపేసే మీరు ఇక్కడి కొచ్చి కూర్చున్నారేం? ఈ జీడిపప్పు తిని, ఈ టీ తాగి, ఈ వక్కపొడి నమిలి. . ." అని నవ్వేసింది రమ.

ప్రకాశరావు టీ తాగాడు. ఖాళీ కప్పు అందుకుంటూ, "అన్నం వార్పు కొచ్చింది. కూర వండేశాను. అన్నం వార్చేసి నేనూ వస్తాను. పిల్లలంతా ఆడుకుందు కెళ్లారు. ఎంచక్కా కబుర్లు చెప్పుకుందాం, ఏం?" అంటూ జవాబు కోసం చూడకుండా మెట్లు దిగి వెళ్లిపోయింది.

అరగంట తరవాత రమ వచ్చింది. భర్తకి ప్రియమైన ఆకాశం రంగు చీర కట్టుకుంది. అదే రంగు జాకెట్టు, గాజులు వేసుకుంది. తల నిండా మల్లె పూలు. కళ్లకి కాటుక. ఎప్పుడూ పిల్లల పనుల్లో మునిగి ఉండే రమ, ఎప్పుడయినా ఇలా పెళ్లయిన కొత్తలోలాగ అందంగా అలంకరించుకుని వస్తే ప్రకాశరావు మొహం ఇంత చేసుకుని, "అబ్బ!" అని కళ్లు మూసుకోవడం, చిరునవ్వు నవ్వుతూ . రమ కళ్లలోకి చూడ్డం, రమ కొత్త పెళ్లికూతురులా సిగ్గుపడ్డం, ప్రకాశరావు 'అల్లరి చిన్నవా' డవడం మామూలే. ఎంత తొందరగా వచ్చినా మొహం విసుగ్గా పెట్టి, "ఎంత సేపూ వంటేనేమిటి? నే వచ్చేలోపున ముగించుకోరాదూ?" అనే ప్రకాశరావుకి ఈ వేళ రమ వచ్చినట్లే తెలియలేదు. కాస్సేపు చూసి, నిరాశ చెంది, రమే పిలిచింది: "ఏమండీ!"

"ఆఁ. . . ఏమిటని?" అన్నట్టు ఇటు తిరిగి చూశాడు ప్రకాశరావు. తన వేపు చూశాడే కాని, ఆ కనుపాపలు తనను చూడటం లేదని ఇట్టే తెలిసిపోయింది రమకి. ఇంక తన అలంకరణేం చూస్తాడు?

"ఇదేమిటి— జీడిపప్పు తినలేదేం?" అంది.

"సహించలేదు. . ." అన్నాడు ప్రకాశరావు మళ్లీ అటు తిరిగి. రమ నివ్వెరపోయింది. జీడిపప్పంటే పంచప్రాణం ప్రకాశరావుకి. ఇదేమిటి ఈ వేళ?

"ఏం, అంత ముభావంగా ఉన్నారేం?" అని అడిగింది ఎంతో మృదువుగా.

మళ్లీ ఉలిక్కిపడ్డంత పని చేశాడు ప్రకాశరావు.

"అబ్బే, ఏం లేదు. ఆ కథల పోటీ సంగతి చదివావా నువ్వు? పోట్టీకి పంపి ఓ కథ రాద్దామనుకుంటున్నా. సరిగ్గా కుదరడం లేదు. కథా వస్తువంతా గజిబిజిగా ఉంది తలలో. ఓ దరికి వచ్చి చావడం లేదు." అసహాయంగా నవ్వుతూ ఇబ్బందిగా కదిలాడు ప్రకాశరావు.

"ఓహో! ఇదంతా ప్రసవవేదనన్న మాట!"

"హ్హాఁ. . . హాఁ. . . అన్న మాటే . . ." గలగల అన్నాడు.

"పోనీ, ఓ పని చేద్దాం. మీరు వెళ్లి స్నానం చేసిరండి. తరవాత ఆ గజిబిజి ఏమిటో నాకు చెప్పండి. ఒకళ్లకి చెప్పుకు పోతుంటే దానంతట అదే కథకి ఒక కోణం, మీరుకూడా అనుకోని ఏంగిల్సు రావచ్చు. ఏమంటారు?"

"మొద్దాంలే. ఇంకా నా మనస్సులోనే కథ సరిగ్గా లేదు" అని నసిగేశాడు ప్రకాశరావు.

"అయితే,మరీ మంచిది. రండి కిందికి, స్నానం చేద్దురుగాని. కాస్త ప్రెష్‌గా ఫీలయితే అదే సరిగ్గా వస్తుంది" అంటూ బలవంతాన భర్తని తీసుకెళ్లి, బాత్‌రూమ్ లోకి తోసి తలుపులు మూసింది రమ.

ప్రకాశరావు స్నానం అయి, బట్టలు మార్చుకుంటూండగా బజ్జర్ మోగింది. రమ వెళ్లి తలుపు తీసింది. ఆ వచ్చింది ప్రకాశరావు చెల్లెలు రాధ మరిది మధుర్ రావు. ముగ్గురూ బయట కుర్చీలో కూర్చుని కబుర్లలో పడ్డారు.

"ఉన్నట్టు, రాధ దగ్గిర్నించి ఉత్తరం వచ్చిందీ నేళ. విశాఖపట్నం వెళ్లి వచ్చిందట. అక్కడి కబుర్లన్నీ రాసింది. కులాసాగానే ఉందట" అన్నాడు అతను వెళ్లిపోతుంటే. "మరి ఇంతవరకు ఉత్తరం సంగతి చెప్పారు కాదేం?" అంది రమ అతన్ని సాగనంపి వస్తూండగా. "ఓ, మీ కథ గొడవలో పడి మరిచిపోయారేమో, ఏం?" అంది తనే మళ్లీ.

"నా కథ కంచి కెళ్లింది!" అన్నాడతను కొంచెం విసుగ్గా.

"అక్కణ్ణుంచి వచ్చి ఇప్పుడు వంటింటికి వెళ్లింది. రండి, ఎనిమిది గంటలయింది. పిల్లలూ ఆకలిగా ఉన్నారు. భోజనం చేస్తూ మీ కథ చెప్పండి" అంటూ వంట ఇంట్లోకి పరుగెత్తింది రమ.

కాని, వంటింట్లో భోజనంతోపాటు పెద్ద పిల్ల వాదవివాదాలు, రెండవ వాడి ఏడుపు, వంటవాడి నిద్ర— వాటికదే ఓ పెద్ద కథ అవడంతో ఎలాగో ఇంత తిని బయట పడ్డాడు ప్రకాశరావు. రమ తనూ తిని, వంటింటి పనులన్నీ ముగించి, పిల్లల్ని పడుకోబెట్టేసరికి తొమ్మిదిన్నర దాటింది.

ప్రకాశరావు మంచం మీద పడుకుని కప్పుకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు. రమ లైటు ఆర్పి, బెడ్‌లైటు వేసి, "పడుకోండి, నాకు ఒకటే నిద్ర!" అంది గోముగా, అతని మెడ చుట్టూ చేతులు వేసి. అతడు అదేమీ పట్టించుకున్నట్లే లేదు.

"చూడు, రమా. కథ చెప్తమన్నావు— చెప్పనా ఇప్పుడు? నా హృదయభారం తగ్గుతుంది. ఇలాగే ఉంటే నాకు నిద్ర వచ్చేలా లేదు." పైకి చూస్తూ పలుకుతున్నట్టుగా అన్నాడు.

"అబ్బ, ఇప్పుడు కథేమిటండీ? పొద్దుటినించి పని చేసి చేసి మత్తుగా ఉంది. కళ్లు నిద్రాభారంతో మూసుకు పోతున్నాయి."

"ఇదుగో, నువ్వు వినదలుచుకుంటే విను. నువ్వు నిద్రపోయినా నేను కూర్చుని రాసుకోక తప్పదు. ఒకసారి ఎవరికైనా చెబితే కొంచెం మార్పులు, చేర్పులు లాంటివి ఏమైనా. . ."

"హాఁ. . . చెప్పండి, ఏం చేస్తాం!" అంది రమ, చేతులు తలకింద పెట్టుకుని.

"ముందు లేచి కూర్చో నువ్వు. పడుకుంటే నాకు క్షణంలో నిద్ర ముంచుకొస్తుంది." గత్యంతరం లేక లేచి కూర్చుంది రమ. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

"రమా, మొన్నోసారి ఉత్తి మాటల వల్ల ఏమవుతుంది అని నే వంటే, ఏమీ కాదు, మాటలవల్ల ఏమైనా నిరూపించవచ్చు, సాధించవచ్చు అన్నావు —



గుర్తుందా? ఆ మాట చుట్టూ ఒక కథ అల్లాను. . ."

"ఓ...అంటే, మీ కథకి స్ఫూర్తి నేనే నన్న మాట!"

"అంత తేలిగ్గా క్రెడిట్ ఇచ్చేస్తా ననుకోకు. నీ నుంచి తీసుకున్నది పట్టి ఐడియా. మాటలంటే పట్టి కబుర్లు కావు, ఐడియాస్. ఆ ఆలోచనల్ని పసిగట్టి, లోతుగా ఆలోచించే శక్తి, తాను గట్టిగా నమ్మిన విషయాలను ఇంకొకరికికూడా నమ్మించే శక్తి. . . ఆ అపూర్వమైన కళ. . ."

"సరే లెండి." మత్తుగా అని, గోడకు చేరగిలబడింది రమ. కాని, ప్రకాశరావు దాన్ని గమనించడం లేదు. ఆవేశంగా చెప్పటం మొదలుపెట్టాడు.

"ఆ కళని స్వంతం చేసుకున్న ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి చాలా తెలివిగలది. ప్రతిభాసంపన్ను రాలు. బోలెడు పుస్తకాలు చదివి, వాటి సారాన్ని కాచి వడబోసిన విజ్ఞానవంతు రాలు. . ."

"అమ్మాయి పేరో?"

"పేరా?. . . వి. . .వి. . . వీణ అనుకో!"

"సరే, చూడ్డానికి బాగుంటుందా, అందరు కథానాయికల్లాగా?"

"ఓ! బాగుండకేం? చాలా బాగుం టుంది. మెరుపు తీగలా ఉంటుంది. మొహంలో, ముక్కులో, కళ్లలో, పెదవుల్లో, గడ్డంలో చురుకుదనం ఉట్టి పడే అందగత్తె."

"హాఁ. . ."

"ఆ అమ్మాయి పక్కింట్లో ఇంకో అమ్మాయి— వాళ్లిద్దరికీ మంచి స్నేహం కుదిరింది."

"మరి ఆ అమ్మాయి పేరూ, రూపు రేఖలూ?"

"ఇలా అడ్డు పడకూడదు. ఆ అమ్మాయి ఏమంత ముఖ్యం కాదు."

"సరే!"

"విను. ఆ అమ్మాయి పేరు లక్ష్మి అనుకో. ఎన్నో విషయాలు మాట్లాడు కునేవారు. చర్చించుకునేవారు. ప్రేమ పెళ్లి లాంటి విషయాలుకూడా వాళ్ల మాటల్లో దొర్లేవి. ఆ అమ్మాయి వీణ ప్రేమను ఎంతో గొప్ప విషయంగా భావించేది. ప్రేమించకపోతే బతుకు వ్యర్థమనుకునేది. ప్రేమ, ప్రేమించే శక్తి ఎంతో అరుదైనవని పరిగణించేది. మాటికి తొంభై తొమ్మిది మంది ఈ అద్భుత వరం విలువని తెలుసుకోలేక, ప్రేమ విలువని గుర్తించలేక జీవితాన్ని నిస్సారంగా చేసుకుంటారని వివరించేది.



దూరమైనా సరే...

ఫోటో—ఎస్. మల్లారెడ్డి (మద్రాసు)

ఎంతో మందికి తాము ప్రేమించామని తెలుసుకోలేని ముగ్ధత! కొంతమందికి ప్రేమించామని తెలిసికూడా వ్యక్తం చెయ్యలేని మూఢత్వం! ఈ విషయాల్ని గురించి వాళ్లిద్దరూ వాదించుకునేవారు. ముగ్ధత వల్ల ప్రేమ లోలోపలే ఉండి పోతుందని, అలా ఎన్నో జీవితాలు ప్రేమ రహిత మవుతాయనే వాదాన్ని అతను ఒప్పుకునేవాడు కాదు."

"అతనెవరు ఈ మధ్య? వాళ్లిద్దరూ—అదే లక్ష్మి, వీణ—ఇద్దరే వాదించుకుంటున్నారు."

"ఆఁ మరిచిపోయాను. 'అతను' ఈ కథకి హీరో. లక్ష్మి అన్నయ్య. సారథి, అతని పేరు. అతనూ చదువుకున్న వాడే. తెలివి కలవాడే. భావప్రధాన మైన వ్యక్తిత్వం కలవాడు. ఈ అమ్మాయిల చర్చలన్నీ వాళ్ల డాబా మీద జరిగేవి. లక్ష్మి వచ్చి అన్నయ్యతో వాదన పెట్టుకుని వీణ మాటలన్నీ తనే చెప్పేది. ఆమె మాటలన్నీ ఇతనికి ఈ విధంగా తెలిసేవి."

"సరే, ముగ్ధత ప్రేమకి శత్రువని అత నెందుకు ఒప్పుకునేవాడు కాదు?"

"అక్కడికే వస్తున్నా నుండు— ముగ్ధత అరవిచ్చిన గులాబి లాంటి దని, అది సుందరమైనదని అతను అనేవాడు."

"మరి ఆ అమ్మాయి దాని కేమనేది?"

"ఆ ముగ్ధతని అర్థం చేసుకునేవా ళ్లున్నప్పుడే దానికి విలువని, దాన్ని కాపాడేవా ళ్లున్నప్పుడే అది సుందరమైన దని అనేది. ఇంక ప్రేమ — ముగ్ధ ప్రేమ మూగ ప్రేమగా ఉండిపోయే అవకాశమే ఎక్కువ. తాను ప్రేమించా మని తెలుసుకొని దాన్ని సరైన రీతిలో వ్యక్తపరిచే శక్తి గల వ్యక్తులు ఈ ప్రపంచానికి వరాల్లాంటి వాళ్లు. తమ బ్రతుకును, తమని ఆశ్రయించేవాళ్ల బ్రతుకును స్వర్గం చేసే శక్తి వాళ్లకి కరతలామలకం. ఇలా చెప్పుకుపోయేది వీణ. ఆమె కంఠం, చెప్పే తీరు, వాడే పదాలు ఒక ప్రత్యేకత కలవి. వినేవాళ్లని ఒక సుందర, అద్భుత, విచిత్రలోకానికి తీసుకువెళ్లేది ఆమె. వెలుగుకి, ఓటమికి, కన్నీటికి తావులేని ఆనందమయ లోక మది, వాళ్లిద్దరూ తన్మయులై కూర్చుని ఆ లోకంలో విహరించేవాళ్లు. బ్రతుకును బంగారం చేసే ప్రేమ కోసం వాళ్ల హృదయాలు తహతహలాడేవి. ఆ ప్రేమ గురించి మాట్లాడే ఆ పిల్లంటే సారథి చెప్పలేనంత మక్కువ పెంచు కున్నాడు. ప్రేమించాడు. ఆ అమ్మాయి కూడా అతనంటే ఇష్టం కనపరిచేది. అతని తెలివితేటల్ని పొగిడేది. మెరిసే పెద్దపాటి కళ్లతో చూసేది. అతను కనిపించకపోతే 'మీ అన్నయ్యేరి, లక్ష్మీ?' అని అడిగేది. మరి ఇవన్నీ ప్రేమచిహ్నాలు కాకపోతే మరి ప్రేమంటే ఏమిటి! ?" అయోమయంగా అన్నాడు ప్రకాశరావు.

"అలా రాస్తారా? మీ నాయికా నాయకుల ప్రేమ గురించి మీకే ఇప్పి తంగా తెలియదన్న మాట!"

తలగడకు ఆనుకుని, ఆలోచనల్లో ఎటో చూస్తున్న అతను ఉలిక్కిపడ్డాడు.

"అబ్బే, అది కాదు, రమా—నిజం. బొత్తిగా ఈ విషయాలు తెలియదులా ఉంది. మన కళ్లెదుట ఉన్న వ్యక్తుల్లాంటి వాళ్లనే నాయికా నాయకులుగా తీసు కుంటామా?"

"అవును, అయితే?"

"వాళ్ల ప్రధాన గుణగణాల్ని వ్రాసి చదివేవాళ్ల మనస్సులో ఆ రూపం, ఆ వ్యక్తిత్వం మెదిలేలా చేస్తాం, అంతే! వాళ్ల ఎరుకలో అలాంటి వ్యక్తులు ఉండక పోరు. అందువల్ల కొంత వాళ్ల ఊహాకి వదిలేస్తే తప్పు లేదు. పైగా కథనీ, వాళ్లనీ దగ్గరగా చేర్చినట్టవుతుంది— నీకు తెలియదు." కొంచెం విసుగ్గా అన్నా డతను.

"ఏమో, బాబూ!". అంటూ రమ మళ్లీ గోడకి చేరగిలబడి ఈ సారి కళ్లు కూడా మూసుకొంది.

"ఇదిగో, రమా, నువ్వు ఇలా నిద్ర పోయావంటే ఊరుకోను."

"అబ్బే, లేదండీ! ఊరికే కళ్లు మండు తుంటేనూ" అని నవ్వింది రమ. కళ్లు మూసుకొని, "ఇంతకీ తరవాత ఏమ యింది? సారథి తన ప్రేమని వెల్లడించ లేదా?" అంది.

"లేదు, రమా. అదీ అతను చేసిన పొరపాటు. ముగ్ధతో, మూఢత్వమో సారథి మొట్టానికి నోరు విప్పలేదు. అంతే, అదే. . . చెబుదాం, చెబుదాం అనుకొంటూండగానే, వీణకి పెళ్ళి నిశ్చయం మయిపోవడం, పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోవడం జరిగాయి. అన్నట్లు, చెప్పడం మరిచాను, సారథి వాళ్ళు ఏమంత డబ్బున్న వాళ్ళు కాదు."

"మరి వీణ గొప్పింటి బిడ్డ అవునా?"

"అవును, నీ కెలా తెలిసింది?"

"అన్ని కబుర్లు కడుపు నిండిన వాళ్ళే చెప్పగలరులెండి."

"ఊఁ అదేం లేదులే."

"లేకపోవడ మేమిటి! తండ్రి స్థిరపడిన ఒక డబ్బున్న సంబంధమే చేసుకుంది ఆ అమ్మాయి."

ప్రకాశరావు మాట్లాడలేదు. కళ్ళు దించుకునే ఉన్నాడు.

"ఏమి టా ఆలోచన? ఇంకోలా రాస్తారా?" అంటూండగానే చంటివాడు లేచి ఏడవడం మొదలుపెట్టాడు.

"ఏమిట్రా, నాన్నా. . ." అని రమ బుజ్జగిస్తే— "మంచినీలు" అన్నాడు వాడు వెక్కుతూనే. పెద్ద పిల్లా లేచి కూర్చుంది—"నాకూనే" అంటూ. రమ నీళ్ళు తాగించి పిల్లల్ని పడుకోబెట్టింది.

"నాకూ కాసిని ఇవ్వు. ఎందుకో చాలా దాహంగా ఉంది" అన్నాడు ప్రకాశరావు. రమ తెచ్చి ఇచ్చింది.

"చాలా నీరసంగా కనిపిస్తున్నారు మీరు. ఆ కథేదో రేపు రాసుకో కూడదూ?"

"ఊఁ హూఁ. ఇంకొంచెమే ఉంది."

"ఏముంటుంది? డబ్బున్నవాణ్ణి చేసుకుని తరవాత పశ్చాత్తాపపడింది— అంతేనా?" జాలిపుగా, మెల్లిగా తల ఆడించాడు ప్రకాశరావు. ఆలోచిస్తూ మెల్లిగా అన్నాడు: "లేదు, అదే వీణ గొప్పదనం. వీణ పెళ్ళయిన వెంటనే సారథి వాళ్ళ నాన్నకి బదిలీ అవడంతో వాళ్ళు ఆ ఊరు వదిలి వెళ్ళిపోయారు. మరుసటి సంవత్సరం లక్ష్మికి పెళ్ళయింది సారథికీ పెళ్ళయింది. ఆ పెళ్ళి తరవాత లక్ష్మీ, వీణ బంధువుల ఇంట్లో కలుసుకున్నారు. చాలా సంబరపడ్డారు. వాళ్ళిద్దరూ దాపరికం లేకుండా చిన్ననాటి కబుర్లన్నీ చెప్పుకున్నారు. మాటల్లో చెప్పి ... కున్నారు. తన అన్న వీణ పెళ్ళయి వెళ్ళిపోయిన తరవాత, ఎంత బాధపడ్డాడో, ఎలా క్రుంగిపోయాడో కళ్ళారా చూసిన లక్ష్మి ఆ విషయం చెప్పకుండా ఉండలేకపోయింది. అప్పుడు వీణ ఏమందో తెలుసా?"

"ఏమంది?" ఇంత వెడల్పుగా కళ్ళు విప్పి అడిగింది రమ.

" 'అయితే, అప్పటి నా థియరీని మీ అన్నయ్య బుజువు చేశాడన్న మాట! పదిహేను, ఇరవై సంవత్సరాల వయసులో ఒచ్చే, ఎడోలిసెన్స్ అంటారు ఇంగ్లీషులో, అప్పుడు మనసు తొందరగా ఇంకొకళ్ళ ప్రభావానికి లోనవుతుంది. భావాన్ని ఆలోచించకుండా మనస్సులో ఉద్భవించిన రూపంలోనే స్వీకరిస్తారు వాళ్ళు. ఆ రోజుల్లో మీ అన్నయ్య నన్ను అడిగి ఉంటే నేనూ ఒప్పుకునేదాన్నేమో? కాని, లక్ష్మీ, అతను అడక్కపోవడమే ఎంతో మంచిదయిందని అనిపిస్తూంది ఇప్పుడు. లేకపోతే నే నీ రోజు ఇంత సుఖంగా, ప్రశాంతంగా బతకడం సాధ్యమయ్యేదా? ఇప్పుడు మీ అన్నయ్యకూడా వదినతో ఎంతో ప్రేమగా ఉన్నాడన్నావు కదూ?

చిన్నప్పటి ఆ భావాలు ఒక రకమయిన ముగ్ధతే, లక్ష్మీ. మీ అన్నయ్య చెప్పేవారు చూడు— 'అరవిచ్చిన గులాబి లాంటి మానసిక స్థితి' అని. అలాగ. నిజం చెప్పు—అప్పుడు నీకుగాని, నాకుగాని ప్రేమ పూర్ణ స్వరూపం తెలిసి ఉండేదా? మీ అన్నయ్యంటే నా కెంతో ఇష్టం ఉండేది, నిజమే. కాని, అదంత గాఢమయిన ప్రణయ భావమని నే ననుకోను. లేత తారుణ్యంలోని ఒక విధమయిన మధురమైన భ్రమ అది. లక్ష్మీ, ఏవో వారు లేక ఒక రోజయినా ఉండగలనా అనిపిస్తుంది నా కిప్పుడు. ఇలా నీలా ఎవరయినా పాత సంగతి ఎత్తినప్పుడు మాత్రం అతను గుర్తుకు వస్తాడు. చిన్న ముల్లు గుచ్చుకున్నట్టయినా అనిపించదు నాకు. నా భర్త, ఇల్లు, ఇంట్లోని ప్రతి వస్తువు— అన్నిటినీ నిండుగా ప్రేమిస్తూ, సుఖంగా, తృప్తిగా, సంతోషంగా ఉన్నాను. నన్నడిగితే పెళ్ళికి తరవాత, అంటే బాగా ఎదిగి, అనుభవం వచ్చాక— స్త్రీ ప్రేమిస్తుంది చూడు. 'ఆ ప్రేమ పూర్తిగా వికసించిన, ప్రేమ సౌరభాన్ని వెదజల్లే గులాబిలాంటిది...' "

"అలా అందిటా?"

"ఊఁ ఇంకా ఏమందో తెలుసా? 'అతన్ని చేసుకొని ఉంటే నేను ప్రేమకి అన్యాయం చేసి ఉండే దాన్నేమో. చిన్నప్పట్నుంచీ సిరిసంపదలతో పెరిగిన నేను అతనితో ఉండి లేదరికం అనుభవించి, జీవితమంతా కోపం, ఉడుకుమోత్తనం, చిరాకుతో ఉండి, తరవాత పశ్చాత్తాపపడి, అతన్ని దూషించి, నిందించి. . . అబ్బ! అప్పుడు ఎక్కడ మిగిలేది మా ప్రేమ! ఈ ప్రపంచంలో ఒక సుఖ సంసారం తక్కువయ్యేది' అందిట."

"ఏమిటండి మరీను! అయితే, మన లాంటి వాళ్ళ కుటుంబంలో భార్యలు భర్తల్ని ప్రేమించటమే లేదనా ఆమె అనేది? మీరేమో మీ నాయిక గురించి, ఆమె ప్రేమించే శక్తి గురించి గొప్పగా రాయబోతున్నారు గాని, మీ నాయికకు ప్రేమంటే ఏమిటోకూడా తెలియదులా ఉంది!"

ప్రకాశరావు అనంగీకారంగా తల ఆడించాడు. "ఛీ, ఛీ! నువ్వు నా నాయికను అపార్థం చేసుకున్నావు. అస లామె సారథిని ప్రేమించనేలేదు కద? పైగా ఉత్త ఆదర్శాలకు పోక, అగర్భశ్రీమంతురాలికి, లేదరికానికి పొత్తు కుదరదన్న విషయాన్ని ముందే ఆకళించుకుని, తన్ను తానే విమర్శించుకుని, తన నిజమనస్తత్వాన్ని అర్థం చేసుకునే గొప్ప శక్తి కలది ఆమె. ప్రపంచంలో తమను తామే మోసగించుకునేవాళ్ళే ఎక్కువ. ఆత్మవంచనకు లొంగిపోలేదు నా నాయిక. అంతేకాదు, ఆ చెప్పే తీరులో, ఆ మాటల్లో ఏమాత్రం మోసం లేదని, చాలా ప్రేమాగాఢంగా నిమ్మళంగా పలుకులు వివరించి చెప్పిందని లక్ష్మికి నమ్మకం ఏర్పడింది. నీ అభిప్రాయం ఏమిటే, రమా?" రమ కళ్ళు మూసుకొని చంటివాడి దగ్గర పడుకుని నిద్రపోతూంది. "ఉస్!" అని నిట్టూర్చి, బోర్లా పడుకుని దోసిట్లో మొహం దాచుకున్నా డతను. 'వీణా, వీణా' అని గుండె కొట్టుకుంటూంటే, వేడి వేడి కన్నీళ్ళు వేళ్ళని తడిపాయి. హృదయాకాశం మేఘం వర్షించిన ఆ వాన వల్ల మనో అంబరం కాస్త నిర్మలమయి, అంతే నిద్రించాడు ప్రకాశరావు.

అతడికి బాగా నిద్ర పట్టిందని నిర్ధారణ చేసుకున్నాక మెల్లిగా లేచి వచ్చి నిండా దుప్పటి కప్పింది రమ. సాయంత్రం కూరలమ్మికి డబ్బివ్వడానికని భర్త జేబులో చెయ్యి పెట్టి, ఆడపడుచు రాధ వ్రాసిన ఉత్తరం కంటపడి, అలవాటు ప్రకారం దాచి చదివింది తను. విశాఖపట్నంలో వీణని కలుసుకున్న సంగతి వివరంగా వ్రాసింది రాధ.

మంచం చివర కూర్చుని తన మృదువైన హస్తాన్ని భర్త నుదురుపైన ఉంచింది రమ. "ఎందు కింత బాధ పడతారు? ఒకళ్ళని ప్రేమించడమనేది ఎంతో మధురమయిన అనుభూతి. అందరూ ప్రేమించలేరు. అందరికీ అంత మృదువయిన హృదయం ఉండదు.

వీణ చెప్పినట్లు అదొక వరం. ఎప్పుడయినా మరీ బాధగా అనిపించి కన్నీళ్ళు కార్చినా, ఆ కన్నీటి వెనక జీవితాన్ని పచ్చగా ఉంచే మృదుత్వం ఉండనే ఉంటుంది. ఈ జ్ఞాపకాలు జీవితాంతం మీలో ప్రేమని, మాధుర్యాన్ని నిలుపుతాయి. నిద్రాణమై ఉన్న మీ ప్రణయ భావాల్ని మేల్కొలిపింది ఆ 'వీణ'. అందులో ఎనలేనన్ని అతి మధుర భావనల్ని వింపు కొనేటట్లు చేసింది. ఒక హృదయంలో ఇంకో వ్యక్తి పట్ల ఎంత మార్దవము, ప్రేమ పెంపొందడానికి అవకాశం ఉందో, అంతటి ప్రేమానురాగాలు ఆమె పట్ల మీకు కలిగాయి. అలా ఆర్ద్రమయిన మీ హృదయం ఎన్నటికీ కఠిన శిలగా మారలేదు. ఈ శాశ్వత మాధుర్యాన్ని మీ హృదయంలో నింపింది ఆమె అయినా, దాని ఫలం అనుభవించేది నేనూ, నా పిల్లలే కదా? అందుకు నేను ఆమెకి కృతజ్ఞురాలిని. నాకు ఆమెపై అసూయ గాని, ద్వేషంగాని లేదు. మీరే భయపడి కథగా చెప్పారు. ఇందుకుకూడా నాకు మీపై కోపం లేదు. ఇది మానవ సహజమైన గుణం. మీ రెలా ఉన్నా నాకు ప్రియాతిప్రియులే. మీరు, మీ దౌర్బల్యంతో సహా నా ప్రియతములు" అన్నాయి ఆ చేతివేళ్ళు.

అతన్ని ఎన్నడూ వదలలేనట్లు పిప్పు చుట్టూ చెయ్యి వేసి గట్టిగా కౌగిలించుకుని పడుకుంది రమ. *

